



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

గురువారం 5 జూన్ 2025 - పేజీలు 8



# మక్కెనకో లేఖ..!

**ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌కు సమస్యలతో లేఖ....**

**నమస్తే సార్,**

మేము... ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులం.. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా మీరు ఎంపిక కావడం మేము మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాం. దీంతోపాటు సహకార సంఘాలు, సహకార బ్యాంకుల్లో ఉన్న అవినీతి, అక్రమాలు, లంచగొండులు,నిర్లక్ష్యం, బంధుప్రీతి, అధికార పార్టీల జాడ్యం వంటి సవాలక్ష సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మీకు పత్రికా ముఖంగా మేం లేఖ రాస్తున్నాం...

ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా మక్కెన మల్లికార్జున రావును కూటమి ప్రభుత్వం నియమించటం ఎంతో హర్షించదగ్గ పరిణామం. ఈ సందర్భంగా మీకు మీ పాలకవర్గ సభ్యులకు జిల్లాలోని రైతుల తరపున ప్రత్యేక అభినందనలు.ఆయన నేడు గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపడుతున్నారు.

గతంలో వినుకొండ శాసనసభ్యుడుగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన మీకు రాజకీయ రంగంలో అపార అనుభవం ఉంది. మీకున్న అపారమైన రాజ నీతి పరిజ్ఞానాన్ని వినియోగించుకునే కేంద్ర సహకార బ్యాంకు ను అభివృద్ధి పథంలో నడిపిస్తారని జిల్లా రైతాంగం ఎంతో ఆశగా, ఆత్రుతగా వేయి కళ్ళతో ఎదురుచూస్తోంది. ఎంతోమంది రాజకీయ దురంధరులు గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పాలకవర్గ చైర్మన్గా పనిచేసి బ్యాంకు ఖ్యాతిని వ్యాపింప చేశారు. అన్నదాతకు చేయూతనిస్తూ వారి సాధక బాధల్లో పాలుపంచుకున్నారు. మీరు కూడా మీకున్న రాజకీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సహకార రంగంలో ఖ్యాతినార్జించిన వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తారని మేం భావిస్తున్నాం. మల్లికార్జున రావు గారు మీరు కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా ఎంతో ఉత్సాహంగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. అయితే సహకార రంగంలో కీలకమైన ఈ వ్యవస్థలో అనేక లోపాలు ఉన్నాయి. సహకార బ్యాంకులు, సహకార సంఘాల్లో కొంతమంది అధికారులు, సిబ్బంది నీతికి, నిజాయితీకి నిలువుటద్దంలా పనిచేశారు. ఇప్పుడున్న వాళ్లలో కూడా ఇలానే పనిచేసే అధికారులు, సిబ్బంది ఉన్నారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక సహకార సంఘాలు, సహకార బ్యాంకులు అవినీతి ఊబిలో కూరుకుపోయి ఎంతో పేరు ఉన్న సహకార వ్యవస్థకే మాయని మచ్చ తెచ్చారు. ఈ విషయం అపార రాజకీయ పరిజ్ఞానం, అనుభవం ఉన్న మీకు తెలియంది కాదు. ముఖ్యంగా పల్నాడు జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ సహకార సంఘాల్లో పెద్ద ఎత్తున అది నీతి జరిగిందని గతంలో ఆరోపణలు వచ్చాయి. ఎంక్వయిరీలు, విచారణ కమిటీల పేరుతో కాలయాపన జరిగిందే తప్ప అవినీతిపరులు ఎక్కడ ఉన్నారో , వారి లంచగొండి బాగోతాలను బయట పెట్టడంలో సహకార శాఖ, గుంటూరు జిల్లా సహకార బ్యాంకు ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికీ ప్రాథమిక సహకార సంఘాల్లో పనిచేస్తున్న అనేకమంది పెయిడ్ సెక్రటరీలు, సిబ్బంది పై. పెద్ద ఎత్తున అవినీతి, లంచగొండులుగా ముద్రలు ఉన్నాయని విషయం మీరు తెలుసుకోవాలి. ఇక సహకార సంఘాలు అవినీతి రొంపలో కూరుకు పోయాయి. ఏ పార్టీ అధికారంలో

మిగతా 3వ పేజీలో

ఏటా రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కనిపించేవి. నేడు ఈ స్థాయిలో ఎండల తీవ్రత కనిపించడం లేదు. ఇంకా రోహిణి కార్తెకు నాలుగు రోజులు ఉన్నా ఎండలజాడ లేకపోవడంతో ప్రజలు ఈ సంవత్సరం ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎండలతో ఉక్కిరి బిక్కిరి కావాల్సిన జనం వర్షాలతో చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు. రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకి రాష్ట్రంలోకి ప్రవేశించాయి. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. పంట పొలాలకు పదును పెట్టి చదును చేసి విత్తనాలు విత్తేందుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. అరకపట్టేద్యానికి సిద్ధమవుతున్నారు. సమయానికి ముందే ఋతుపవనాలు ప్రవేశించడంతో మెట్ట, వాణిజ్య పంటల రైతులు కూడా ఈ ఏడాది సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు సిద్ధమవుతున్నారు. రోహిణి కార్తె వచ్చినా ఎండల తీవ్రత అంతగా లేకపోవడమే కాక వాతావ రణం చల్లబడింది.

– గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

- కనిపించని ఎండల తీవ్రత
- గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- కార్తెకు ముందే విస్తారంగా వర్షాలు
- చల్లబడిన వాతావరణం
- పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు
- సాగుకు ఉపక్రమించిన రైతులు
- మెట్ట సేద్యానికి అరక పట్టిన అన్నదాతలు



# రోహిణి రివర్స్..!

ఈ ఏడాది జిల్లాలో విచిత్ర వాతావరణం నెల కొంది. రోహిణి కార్తె వచ్చినా ఎండల తీవ్ర త అంతగా లేకపోవడమే కాక వాతావ రణం చల్లబడింది. సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న నానుడికి అనుగుణంగా ఏటా అదేస్థా యిలో ఎండలు ఉంటాయి. అయితే ఈసారి అందుకు పూర్తి భిన్నమైన పరి స్థితి నెలకొంది. వేసవి ముగింపు సమ యంలో వచ్చే ఈ కార్తెలో ఏడాది మొత్తం మీద అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవు తాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈ కార్తెలో 42 నుంచి 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు

మిగతా 3వ పేజీలో



## బఎస్పీ బాలసుబ్రమణ్యం 79వ జయంతి వేడుకలు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలో టౌన్ హాల్ నందు ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహం వద్ద ఎస్పీ బాలసుబ్రమణ్య%శీ% 79 వ జయంతి వేడుకల సందర్భంగా నరసరావుపేట కళాకారులు, సంగీత అభిమానులు వివిధ సేవా సంస్థల వారు,ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో పొన్నపాటి ఈశ్వర్ రెడ్డి, జుజ్జూరి వెంకట్రావు, కొరారి రంజిత్ కుమార్, బివి చంద్రశేఖర రావు,బత్తుల మురళి,చేగు వెంకటేశ్వరరావు, వసంత విహార్ చంద్ర,నరేంద్ర మాస్టర్,ఓగూరి నాగేశ్వరరావు, స్వర్ణ రామిరెడ్డి, బాజీ మస్తాన్, పోలేశ్వరరావు, అమర్నాథ్ చంద్రమోహన్, ఎమ్మెస్ బాబు, పాషా, బాజాన్, పోతర్లంక రవి, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు....

## శివాలయానికి భారి గేట్లు బహుకరణ



**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెద్దకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానమునకు క్యూ లైన్లుగా వినియోగించుటకు ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల మండలం, గనిఆత్కురు గ్రామ వాస్తవ్యులు పాములపాటి రవిమణికంఠ ధర్మపత్ని సునయన దంపతుల కుమారుడు పాములపాటి హేమాన్ష్ జింకు పైపులతో చేసిన రూ.లక్ష విలువ చేయు 25 బారిగేట్లు దేవస్థానంనకు సోమవారం అందజేసినట్లు ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకమునకు భక్తులు విరివిగా విరాళము సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించవలసిందిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం దాతలకు ప్రత్యేక దర్శనం,వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 700 వ రోజు చేరుకున్న భరతమాత అన్నవితరణ పథకం..



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** పట్టణంలోని బేడ, బుడిగి జంగాల కాలనీలో 700 వ రోజు భరతమాత అన్నప్రసాద వితరణ పథకం కింద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సొలస అన్నదాన ట్రస్ట్ పౌండర్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గుర్రం కోటివీరయ్య, కుమారుడు గుర్రం పార్థసారథి, ధర్మపత్ని మిట్టపల్లి గీతాంజలి ఆర్థిక సహాయంతో వీరు 10 రోజులపాటు అన్నప్రసాదం రోజుకు 121 మందికి ఏర్పాటు చేయమని ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్బంగా వీరి సహాయంతో 10 రోజులు సేవా కార్యక్రమము తోపాటు 700 రోజులు దిగ్విజయంగా పూర్తి అయ్యిందని దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్బంగా భరతమాత అన్నప్రసాద వితరణ పథకం రూపశిల్పి, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ మంచి రుచి , శుచి రకమైన బోజనము తక్కువ ధరకు అందించిన ఒగిబోయిన కొండలు కు, ఇన్ని రోజులు సేవలు అందించిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. 700 రోజులుగా భరతమాత అన్నప్రసాద వితరణ పథకం నకు ప్రత్యక్షంగానూ.. పరోక్షంగానూ సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ దివ్వెల శ్రీనివాసరావు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి




**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సి.హెచ్ మౌనిక అన్నారు. బుధవారం తాడేపల్లి మున్సిపల్ మీటింగ్ హాల్ లో భారతీయ రిజర్వు బ్యాంక్ వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్( ఖాతాదారుల చైతన్య అవగాహన సదస్సు) పై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మౌనిక మాట్లాడుతూ అందరూ తమ బ్యాంకులో పరపతిని పెంచుకోవాలని, సంపాదనలో ఇరవై శాతం తప్పకుండా పొదుపు చేయడం నేర్చుకోవాలని అన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ఆర్థిక క్రమశిక్షణ కలిగి లక్షాధికారి కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ బ్యాంకులో మాత్రమే మీ డబ్బుకు భద్రత వుంటుందని, ప్రైవేటు వడ్డీల జోలికి వెళ్లకూడదని అన్నారు . మెప్మా పట్టణ కమ్యూనిటీ ఆర్గనైజర్ లు రమణ, పద్మ లు మాట్లాడుతూ బ్యాంకులతో మంచిగా లావాదేవీలను నడపాలనీ, డిఫాల్టర్ గా ఉండకూడదని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి బ్యాంకు సేవలను మన పరిసర ప్రాంతాలలో అందరికీ తెలియజేయాలని అన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక విప్పర్ల విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా స్థిరపడాలని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని అన్నారు. ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ లు వెంకటేశ్వరరావు, షేక్ బాజి, తురకా మంగయ్య లు మాట్లాడుతూ బ్యాంకులోని నిరర్థక ఖాతాల నుండి సేకరించిన నిధులతో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, బ్యాంకులో జరిగే ఖాతాలు మరియు పొదుపు నిర్వహణ గురించి వివరించారు.బ్యాంకు సేవలు కోసం ఇతరులపై ఆధారపడకూడదని, సొంతంగా ఎటిఎంను వాడటం అలవాటుచేసుకోవాలని సూచించారు. డిజిటల్ అరెస్టు గురించి తెలుసుకొని అప్రమత్తంగా వుండాలని, బ్యాంకు సేవలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు అలవాటు చేసుకొని సమయాన్ని ఆదా చేసుకోవాలని, బ్యాంకు ద్వారా జరిగే డిజిటల్ సేవలను వివరించి, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్పీ అధ్యక్షురాలు రాణి,విజయకుమారి,రమాదేవి,దుర్గాఇంద్రాణి,శౌరయ్య,నాగేశ్వరరావు, వివిధ సంఘాల ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం ఫౌండేషన్ సేవలు అద్భుతం

- మహిళల విద్యా, నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పాటు
- తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా ప్రశంస
- కురగల్లులో కంప్యూటర్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్ల ప్రారంభం



**మంగళగిరి మేజర్ న్యూస్ :** చెన్నై లోని ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, వారికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలు అద్భుతమని తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా కొనియాడారు. ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజధాని గ్రామం కురగల్లులో బుధవారం ఉచిత కంప్యూటర్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వర్శిటీ ప్రో%-%ఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్‌తో కలిసి బుధవారం సబ్ కలెక్టర్ సంజనాసింహా ఈ సెంటర్లను ప్రారంభించారు. మహిళలతో ముచ్చటించారు. ట్యూషన్ చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరావతిలో అతిపెద్ద విద్యా సంస్థగా ఎస్ఆర్ఎం వేలాది మంది విద్యార్థులకు విజ్ఞాన జ్యోతులను వెలిగిస్తుందన్నారు. విద్యా సంస్థలు కూడా సామాజ సేవకు ముందుకు వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. నేటి ఆధునిక జీవనంలో మహిళలకు డిజిటల్ అక్షరాస్యత అత్యంత ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్‌పై కనీస పరిజ్ఞానంను పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్ఆర్ఎం వర్శిటీ ఆ దిశగా గ్రామంలోనే నిపుణులతో ఉచితంగా అందిస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని, అందుకోసం స్వయం ఉపాధి కోర్సులను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతోనే గ్రామీణ ప్రాంతాల్లో టైలరింగ్, కంప్యూటర్ శిక్షణ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఆర్ఎం వర్శిటీ ప్రో%-%వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఉన్నత చదువులతోని విజయ సోపనాల అధిరోహణ సాధ్యమన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉచిత సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి డీ వీ వెంకటగిరి తెలిపారు. చెన్నై, అమరావతితో పాటు ఢిల్లీలోనూ ఈ ఉచిత సేవా సెంటర్లను నడుపుతున్నట్లు చెప్పారు. అమరావతి ప్రాంతంలో ఇప్పటికే మూడు సెంటర్ల ద్వారా ఉచిత సేవా కార్యక్రమాలను ప్రారంభించామని, త్వరలోనే మరిన్ని విస్తరిస్తామన్నారు. మారుమూల పల్లెకు వచ్చి ఉచితంగా ఉపాధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎస్ఆర్ఎం వర్శిటీ సేవలు ఎన్నటికి మరచిపోలేమని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారధి కొనియాడారు. మహిళలతో పాటు యువత కూడా ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు రామారావు పిలుపునిచ్చారు. గ్రామస్తులు తరుపున వర్శిటీ ప్రోఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్, ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వెంకటగిరిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సంజనా సింహ ఎస్ఆర్ఎం ట్యూషన్ సెంటర్ల టీచర్లు ప్రతిపాటి సుష్మ, పుణ్యవాణి కొండూరు భారతి ప్రమీల, ధన కుమారి లను వేదికపైకి ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు అనంతరం ఎస్ఆర్ఎం ఫౌండేషన్ పనితీరును వివరించే న్యూస్ లెటర్ ను సబ్ కలెక్టర్ సంజన వేదికపై ఆవిష్కరించారు ఫౌండేషన్ కార్యదర్శి వెంకటగిరి ఆచార్య సతీష్ లు సంయుక్తంగా సబ్ కలెక్టర్ కు జ్ఞాపిక ప్రధానం చేశారు ఈ సందర్భంగా కురగల్లు ట్యూషన్ సెంటర్ విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు ఇతర ఇతర స్టేషనరీని పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అడిషనల్ రిజిస్టర్ డాక్టర్ వినాయక, డైరెక్టర్లు అనూప్ సింగ్, రేవతి బాలకృష్ణ సిద్ధార్థ త్రిపాఠిలతో పాటు మీడియా మేనేజర్ వేణుగోపాల్ గంగిశెట్టి పాల్గొన్నారు.



# ఏపీ ఎడ్‌సెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

**ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి - ఒక నిమిషం నిబంధన అమలులో ఉంది**

**ఏఎన్ యు/ పెదకాకాని మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరంలో బీఈడీ కోర్స్‌లలో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఎడ్‌సెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పర్యావరణ విభాగం ప్రొఫెసర్, ఏపీ ఎడ్‌సెట్-2025 కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి తెలిపారు. ఎడ్‌సెట్ ఆన్లైన్ కంప్యూటర్ బేస్డ్? టెస్టుకు మొత్తం 17,,795 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 87 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం గం.2 నుంచి గం.4 మధ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమకు కేటాయించిన సెంటర్‌లో మధ్యాహ్నం గం.12.30 నుండి పరీక్షా కేంద్రంలోనికి అనుమ తించటం జరుగుతుందని , ఒక నిమిషం నిబంధన అమలులో ఉంటుందని వివరించారు. హాల్‌టికెట్‌తో పాటు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, ఓటర్ ఐడెంటికార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు, బ్లూ లేదా బ్లాక్ పెన్ తమవెంట కలిగి ఉండాలన్నారు.ఏపీ ఎడ్‌సెట్ ను అత్యంత సమర్థవంతంగా నిర్వహించడానికి పలు విశ్వవిద్యాలయాలకు చెందిన సీనియర్ అధ్యాపకులను కో-ఆర్డినేటర్లుగా నియమించినట్లు తెలిపారు

# సుపరిపాలన మొదలై ఏడాది

## జూన్ 4 ప్రజాస్వామ్యం బ్రతికిన రోజు - ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనను ఓర్పుతో భరించిన ప్రజలు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పారని, జూన్ 4, భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి ముగింపు పలికిన రోజు అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ బుధవారం వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు... మంచి పాలకులను ఎన్నుకొనే స్వేచ్ఛ ప్రజలకే ఉందని మరోసారి నిరూపించారని, రాష్ట్రాన్ని యధేచ్ఛగా కొల్లగొట్టిన జగన్ ముఠాను ప్రజలు అధఃపాతాకానికి తొక్కారని అన్నారు. యువత, రైతులు, ఉద్యోగులు, మహిళలు, విద్యావంతులు, వ్యాపారులు, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు చెందిన ప్రజలు అవినీతి అసమర్థ పాలనకు చరమగీతం పాడారు. ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ మొత్తం అన్ని ప్రాంతాలలో కూటమి విజయం సాధించింది. 2019 ఎన్నికల్లో తాము మోసపోయానని గ్రహించిన ప్రజలు 2024లో తీర్పును తిరగరాశారని అన్నారు. ఈ మేరకు మన్నవ మోహనకృష్ణ బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. "నమ్మి అధికారమిచ్చిన ప్రజలనే జగన్‌రెడ్డి బలమైన పోటు పొడిచారని, ప్రజల తీర్పును వెన్నుపోటుగా చూపడం జగన్ ముఠా అజ్ఞానానికి, అహంకారానికి నిదర్శనం. వెన్నుపోటు దినోత్సవం పేరుతో గుంటూరులో మాజీమంత్రి అంబటి రాంబాబు



పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం దుర్మార్గం. తండ్రి అధికారాన్ని, కాంగ్రెస్‌ను అడ్డం పెట్టుకుని వేల కోట్లు సంపాదించి.. అదే కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలను వెన్నుపోటు పొడిచారు. వైసీపీని స్థాపించిన శివకుమార్‌కు వెన్నుపోటు పొడిచి ఆ పార్టీని కబ్జా చేశారు. ఎత్తుకొని పెంచిన చిన్నాన్నను క్రూరంగా గొడ్డలితో నరికి చంపిన హంతకుల్ని కాపాడుతూ రక్తసంబంధానికే వెన్నుపోటు పొడిచారు. తల్లి, తండ్రి మాటను కాలదన్ని చెల్లికి ఆస్తిలో సమభాగస్వామ్యం ఎగ్గొట్టి కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచారు. నవరత్నాల పేరుతో నవమోసాలు చేశారు. మద్యనిషేధంపై మాట తప్పి మడమ తిప్పారు. మద్యం ఆదాయాన్ని 25 ఏళ్లు తాకట్టు పెట్టారు. నాసిరకం మద్యం పోసి వేలాది మంది ప్రాణాలు పోగొట్టి.. వారి మాంగల్యాలు మంట కలిపారు. నాసిరకం మద్యం రేట్లు మూడు రేట్లు పెంచి పేదల సంపాదన కొల్లగొట్టారు. అమ్మ ఒడికి రూ.13,000 ఇచ్చి నాన్న బుడ్డీలోనుంచి రూ.లక్ష కొట్టేశారు. డ్రైవర్ కు రూ.10,000 ఇచ్చి.. డీజిల్, పెట్రోల్ జరిమానాలు పెంచి.. లక్ష కొట్టేశారు. మత్స్యకారులకు రూ.10,000 ఇచ్చి జీవో 217 ద్వారా చెరువులు, రిజర్వాయర్లలో చేపలు పట్టుకునే హక్కు రద్దు చేశారు. ఇలా పది ఇచ్చి పేదల వద్ద వంద గుంజుకున్నారు. సుమారు పది లక్షల ఎకరాల అసైన్మెంట్ భూముల్ని జగన్ ముఠా కబ్జాలు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి.. పేదల వెన్ను విరిచారు. ఈ మోసాలను ప్రశ్నించిన బీసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీల్ని 600 మందిని హత్యలు చేయించారు. వేలాది మందిపై అక్రమ కేసులు పెట్టి జైళ్ళకు పంపారు. మాటల్లో పేదల పట్ల కపట ప్రేమ ఒలకబోస్తూ ఆచరణలో పేదలను జగన్ నిరుపేదలుగా దిగజార్చారు. వైసీపీ మేనిఫెస్టో హామీల్లో 85% ఎగనామం పెట్టారు. ఇలా పేదలకు వెన్నుపోటు పొడిచిన మోసకారి జగన్. వెన్నుపోటు దినోత్సవం జరుపుకునే అర్హత జగన్‌కు లేదు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌దే. తన వెన్నుపోటు లక్షణాలను చంద్రబాబుకు అంటగట్టి చేసిన దుష్ప్రచారమే వంద సార్లు చేస్తున్నారు." అని మోహనకృష్ణ నిప్పులు చెరిగారు.

# పెదవడ్లపూడి గ్రామంలో ఎల్‌వోసీ చెక్కులు పంపిణీ

**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి మండలం, పెదవడ్లపూడి గ్రామానికి చెందిన సనం వెంకయ్య దంపతులు రోడ్డు ప్రమాదానికి గురికాగ వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను స్థానిక నాయకులు బుధవారం బాధితుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. సనం వెంకయ్యకు రూ. 1,50,000 లక్షలు, సనం రాజకుమారికి రూ. 1,25,000 లక్షల విలువైన ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జువ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ బాధితులు మెరుగైన వైద్యం చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం సహాయనిధి ద్వారా



ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, గుడిమెట్ల మరీయదాస్,జాలాది సందీప్, శానం రఘు, గుడిమెట్ల ఎల్లయ్య, కోటేశ్వరరావు, దీపు, డికోల్లు పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు

# రోహిణి రివర్స్..!

(మొదటి పేజీ తరువాయి)

నమోదవుతాయి. ఆలాంటిది ఈ ఏడాది ఎండల తీవ్రత లేకపోవడమే కాక గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె రాగా గుంటూరు జిల్లాలో35 డిగ్రీల లోపునే గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. అంటే సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు తక్కువ. అలాగే అత్యధిక ఉష్ణోగ్రతలు (42 నుంచి 45 డిగ్రీలు) నమోదయ్యే పలు మండలాల్లో సైతం ప్రస్తుతం 38 డిగ్రీల లోపుగానే ఉంటున్నాయి.

**విస్తారంగా వానలు**

ఈ ఏడాది రోహిణికార్తె వచ్చే నాటికే జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. జిల్లాలోని పలు మండలాల్లో సాధారణం కన్నా రెండు నుంచి నాలుగు రెట్లు అధికంగా వానలు పడ్డాయి. జిల్లాలో మే నెల సాధారణ వర్షపాతం 53.0 మి.మీ. కాగా ఈనెల 27 నాటికే 103.10 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. రోహిణి కార్తె వచ్చే నాటికే దాదాపు 100 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గత మూడు రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా భారీవర్షం కురిసింది. కృష్ణ డెల్టా ప్రాంతంలో పశ్చిమ ప్రాంతంలోని తెనాలి బాపట్ల, పొన్నూరు, గుంటూరు, మంగళగిరి, నరసరావుపేట, చిలకలూరిపేట, పల్నాడు జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలతో పాటు కొన్ని మండలాల్ రెట్టింపు నుంచి నాలుగు రెట్లు అధిక వర్షం కురిసింది.

**పదునెక్కిన భూములు**

జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో కూడా సాధారణం, అలాగే అధికంగా వాన కురిసింది. దీంతో చాలా ప్రాంతాల్లో భూములు పదునెక్కాయి. దీంతో రైతాంగం తొలకరి సాగుకు ఉపక్రమించింది. జూన్ ఆరంభం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం లెక్క. కాగా అంతకు ముందే వర్షాలు పడితే తొలకరి పంటలైన కూరగాయలు, పెసర, జనుము, జీలుగ, పిల్లిపెసర, వంటి పచ్చిరొట్టతోపాటు పశుగ్రాస పంటలను రైతులు వేస్తారు. అయితే విస్తారంగా వానలు పడటంతో పలుచోట్ల తొలకరి పైర్లతోపాటు ఖరీఫ్ పంటలను కూడా కాస్తంత ముందుగానే వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. అధిక ప్రాంతాల్లో అందుకు వీలుగా ప్రస్తుతం దుక్కులను సిద్ధం చేస్తున్నారు. కొన్నిచోట్ల నువ్వు చల్లుతుండగా పెసర, సజ్జ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పల్నాడు, తెనాలి జంక్షన్ లోని కొన్ని ప్రాంతాల్లో రైతులు బోర్ల ద్వారా నీరు సౌకర్యం ఉన్నచోట్ల కొన్ని ప్రత్యేక పంటలకు శ్రీకారం చుట్టారు.పత్తితో పాటు సాగుకు ఉపక్రమించారు. మొత్తంగా జిల్లాలో వేసవి తీవ్రత పోయి సాగు వాతావరణం రోహిణి కార్తెలో కనిపిస్తోంది. పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

# మక్కెనకో లేఖ..!

(మొదటి పేజీ తరువాయి)

ఉంటే ఆ పార్టీ రాజకీయ నాయకుల చెప్పు చేతుల్లో సహకార సంఘాలు నలిగి నాశనమైపోతున్నాయి. 2004లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బైద్యనాథ్ కమిటీ సిఫార్సుల మేరకు జిల్లాలో నష్టాల్లో ఉన్న సహకార సంఘాలను కొద్దో గొప్ప లాభాలున్న సంఘాల్లో కలిపి నాటి ప్రభుత్వం నష్టాల్లో ఉన్న సహకార సంఘాల అప్పులను రద్దు చేసిన విషయం మీకు విధితమే. ఇలా చేసినా ఇప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అనేక సొసైటీలు నష్టాల బాటలో నడుస్తున్నాయి. ఎందుకు నష్టాలు వస్తున్నాయి? ఎక్కడ లోపం ఉంది? రైతులను ఆదుకోవాల్సిన సహకార సంఘాలు లక్ష్యం దిశగా పనిచేస్తున్నాయా లేదా అని ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సహకార సంఘాలు రైతులకు ఇస్తున్న వ్యవసాయ, లాంగ్ టర్మ్, మిడిల్ టర్మ్ రుణాలు ఇవ్వడంలో దాదాపు అన్ని సహకార సంఘాల్లో పెయిడ్ సెక్రటరీలు, సహకార బ్యాంకుల్లో పనిచేస్తున్న సిబ్బంది రుణం పొందే రైతుల నుండి పర్సంటేజీలు గుంజుతున్నారనే ఆరోపణలు ఎంతో జుగుప్సాకరంగా ఉన్నాయి. ఎవరు అవునన్నా, కాదన్నా ఇది ముమ్మాటికి నిజం. . నిజం.. ఇక రైతులకు అండగా ఉండాల్సిన సహకార సంఘాల్లో రుణాలు పొందాలంటే అన్నదాతలు చెప్పులు అరిగేలా సొసైటీలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి దాపురించింది. తిరగలేక, వ్యవసాయ పనులు చూసుకోలేక, సహకార సంఘాల్లో, బ్యాంకుల్లో సిబ్బంది చేతివాటాన్ని నిలదీయలేక రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు. అవినీతిపరుల గుట్టు బయట పెట్టాలని చూసిన రైతులకు రుణాలు ఇవ్వకుండా కొర్రీ వేసి, కేసులు పెట్టి నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో అనేక ప్రాంతాల్లో కో కొల్లలుగా జరిగాయి. రాజకీయ పరపతి, పలుకుబడి బాగా ఉండి, అధికార పార్టీ కను సన్నల్లో మెలిగే రైతులకు మాత్రమే రుణాలు అందజేసిన దాఖలాలు గతంలో ఉన్నాయి. ఇక పల్నాడు జిల్లాలో విచిత్ర పరిస్థితులు కనిపిస్తాయి. గత వైసీపీ పాలలో పల్నాడు జిల్లాలోని వినుకొండ, మాచర్ల, గురజాల, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, తదితర నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలను బ్యాంకుల్లో పెట్టుకొని రుణాలు మంజూరు చేసిన ఘనులు ఎంతోమంది ఉన్నారు. వినుకొండలో అటవీ భూములను కూడా సహకార సంఘాల్లో తనఖా పెట్టి రుణాలు పొంది సొసైటీల ఉనికిని ప్రశ్నార్థంగా మార్చిన దళారీలు అనేకమంది ఉన్నారు. వీరికి సొసైటీలోని పెయిడ్ సెక్రటరీ లు, బ్యాంకు సిబ్బంది, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు వత్తాసు పలికి అక్రమార్కులతో చేతులు కలిపి పల్నాడు జిల్లాలోని పలు సొసైటీలను భ్రష్టు పట్టించారనటంలో ఇలాంటి సందేహం లేదు. కేసులు పెట్టాం.. విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతోందని చేతగాని మాటలు చెప్పి అధికారులు రైతుల చెవుల్లో పూలు పెడుతున్నారు. వినుకొండ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సొసైటీలో జరిగిన అక్రమాల పై ఇంతవరకు ఎంతమందిపై చర్య తీసుకున్నారో సహకార బ్యాంక్, విచారణ అధికారుల నుంచి నిజాలు నిగ్గు తేల్చి అక్రమార్కులకు సంకెళ్లు వేయాల్సిన అవసరం, కీలకమైన బాధ్యత మీపై ఉంది. ఇక అన్ని వాణిజ్య, కమర్షియల్ బ్యాంకుల్లో పెద్ద ఎత్తున బంగారు రుణాలను ఇచ్చి రైతులను ప్రోత్సహించడంతోపాటు ఆ బ్యాంకులు వ్యాపార లావాదేవీలను విస్తరించుకుంటున్నాయి. కానీ సహకార బ్యాంకులో ఈ పరిస్థితి కనిపించదు. బంగారు రుణాలు ఇవ్వడంలో ఒక్కొక్క బ్యాంక్ ఒక్కొక్క రకంగా నిబంధనలను పెట్టుకున్నట్లుగా ఉంది. రిజర్వ్ బ్యాంక్, నాబార్డ్ నిబంధనల ప్రకారం అనేక మండల ప్రాంతాల్లో ఉన్న సహకార బ్యాంకులో బంగారు రుణాలను ఇవ్వడం లేదు. వ్యాపారాన్ని పెంచుకుని బ్యాంకు ను లాభాల్లో నడుపుదామనే ఆలోచన అక్కడ పనిచేసే సిబ్బంది, అధికారులకు ఏమాత్రం లేదు. దీనిపై సహకార బ్యాంక్ చైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న మీరు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. చేతిలో చిల్లిగవ్వ లేక బిక్కుబిక్కుమంటూ డబ్బుల కోసం దిక్కులు చూస్తున్న రైతులు సొసైటీలో దరఖాస్తు చేసుకున్న వారం, పది రోజుల్లోగా రుణాలు ఇవ్వడం ఎంతో అవసరం. ప్రతి సొసైటీ పై నిఘా పెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది. చేతివాటాన్ని ప్రదర్శిస్తూ కుబేరులుగా మారుతున్న సొసైటీ పెయిడ్ సెక్రెటరీలపై దృష్టి పెట్టండి. చాప్టర్ ఎక్కడ జరుగుతుందో గుర్తించండి. బ్యాంకు అధికారులను వదిలించండి. సొసైటీ సిబ్బంది లో ఉన్న నిర్లక్ష్యాన్ని ఏమాత్రం ఉపేక్షించవద్దు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్యాంక్, సొసైటీ ల సిబ్బంది ఎంతమంది ఉన్నారో వారి జాబితా తయారుచేసి వారికి తగిన శిక్ష పడేలా చేయండి. పెయిడ్ సెక్రటరీల అవినీతిని తుంచేసి రైతుల్లో సహకార సంఘాల, బ్యాంకుల పరపతిని పెంచాల్సిన బాధ్యత మీపై ఎంతో ఉంది. జిల్లాలో సహకార సంఘాల వైపు చూస్తున్న రైతులకు మీరు నిబద్ధత, నిష్పక్షపాతంగా, రాజకీయ పార్టీలకు అతీతంగా చేయి తెలుస్తారని ఆశిద్దాం.. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా బాధ్యతలు చేపడుతున్న మీకు జిల్లా రైతుల తరఫున అభినందనలు తెలియజేస్తున్నాం..

**– ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులు**

## ఏడాదిలోనే నవశకానికి నాంది

### వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



ఏడాది కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త పునాదులు వేశామని, ఇది ప్రజల ఆశీర్వాదంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని రత్నపురి కాలనీ, మల్లికార్జునపేట, శారదా కాలనీ ప్రాంతాలలో ఎమ్మెల్యే నసిర్ పర్యటించారు. ఉదయాన్నే స్థానిక ప్రజలతో మాట్లాడి ఆయా ప్రాంతాలలో ప్రభుత్వపరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. రేషన్ కార్డులు, మంచినీటి సరఫరా, పెన్షన్లు, రోడ్లు, శానిటేషన్ వంటి సేవలపై లబ్ధిదారులతో మాట్లాడారు. ఎవరికి ఎలాంటి సర్వీసు అందకపోయినా తనను నేరుగా సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. అనంతరం శానిటేషన్ కు సంబంధించి మురుగునీటి వ్యవస్థ ఇంకా మెరుగుపడాలని అధికారులకు సూచించారు. ఎక్కడ వీధులలోగానీ, ఇంటి పరిసరాలలోగానీ చెత్త కనిపించకుండా చూడాలని, దీనిపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. ఏడాది పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అనూహ్యమైన మార్పులకు నాంది పలికామని, దీనికి గర్వంగా ఉందని అన్నారు.గతంలో గుంటూరు తీర్పు నియోజకవర్గమంటే వెనకబడిన ప్రాంతంగా చూసేవారని, ఐదేళ్లపాడు ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని తెలిపారు. తాము అధికారం చేపట్టిన వెంటనే ప్రణాళికాబద్ధంగా రోడ్లు, సీసీ డ్రైన్లు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ముందడుగు వేశామని తెలిపారు. ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోనే నవశకానికి నాంది పలికిందని చెప్పారు. పారిశ్రామికంగా, అభివృద్ధి పరంగా, సంక్షేమ పరంగా ఆదర్శవంతమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంకాళి నరసింహారావు, పఠాన్ బాజీ, గిరిబాబు, మోహన్, బాబురావు, దయా రత్నం, కోటా పిచ్చిరెడ్డి, జమీర్, హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ



**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగానికి చెందిన బత్తెన త్రివేణి అనే విద్యార్థినికి బుధవారం విజ్ఞాన్స్ యూనివర్సటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ " సమ్ ప్రాబ్లమ్స్ ఆన్ కన్వెక్టివ్ బౌండరీ లేయర్ ఫ్లో ఆఫ్ నాన్%-%న్యుటోనియన్ ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ట్రెచ్చింగ్ షీట్" అనే అంశంపై విద్యార్థిని పరిశోధన చేసిందని తెలియజేశారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మునగాల వెంకట సుబ్బారావు గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈమె తన పరిశోధనలో భాగంగా మొత్తం 3 ఎస్‌సీఐ పేపర్స్‌ను పబ్లిష్ చేశారని తెలియజేసారు. డాక్టరేట్ పొందిన బత్తెన త్రివేణిను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## నగరాలలో కృష్ణ హాస్పిటల్ ప్రారంభం





**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** గుంటూరు అమరావతి రోడ్డులోని నగరాలలో నూతనంగా ప్రారంభించిన కృష్ణ హాస్పిటల్ అండ్ ల్యాబ్స్ లో అతి తక్కువ ఫీజులతోనే నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు హాస్పిటల్ ప్రొప్రైటర్ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం అమరావతి రోడ్డులోని జి వి ఆర్ కన్వెన్షన్ పక్కన కొత్తగా కృష్ణ హాస్పిటల్ అండ్ ల్యాబ్స్ పేరుతో హాస్పిటల్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ హాస్పిటల్ ని ప్రొప్రైటర్ గా ఉన్న తన తల్లిదండ్రుల చేతుల మీదుగా ప్రారంభించుకోవడం మాకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ హాస్పిటల్ లో మల్టిస్పెషాలిటీ సేవాలతోపాటు జనరల్ గా అవసరమైన అన్ని రకాల వైద్య సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు వారు వెల్లడించారు. హాస్పిటల్ ను కొత్తగా ప్రారంభించినప్పటికీ అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందించబడతాయన్నారు.

# రెడ్ బుక్ పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వం : గజ్జల

### వెన్నుపోటుదినం అంటూ భారీ ర్యాలీ - వాగ్దానాలు మరిచిపోయిన కూటమి ప్రభుత్వం






**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు మర్చిపోయి రెడ్ బుక్ పాలన చేస్తుందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. వైయస్సార్సీపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు చేపట్టిన వెన్నుపోటుదినం భారీ ర్యాలీ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ భారీ ర్యాలీ వైసీపీ కార్యాలయం నుండి గడియార స్తంభం మీదుగా తాసిల్దార్ కార్యాలయం చేరింది. అనంతరం సత్తెనపల్లి తాసిల్దార్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ ఈ ర్యాలీని చూస్తే టిడిపి ప్రభుత్వం మీద ఎంత విరక్తి వస్తుందో కనిపిస్తుందన్నారు. ర్యాలీ ఇంత ఘనంగా జరిగిందంటే దానికి కారణం కూటమి టిడిపి ప్రభుత్వాల అరాచకమే. వాళ్ళు చేసేదంతా వైసిపి కార్యకర్తలు నాయకులు మీద కక్ష సాధింపులే. వెయ్యి మంది వైసీపీ నాయకుల పై కేసులు పెట్టారు దానిలో చనిపోయిన వారు 300 మంది ఉన్నారన్నారు. రైతు భరోసా అమ్మ ఒడి నీకు 15 నీకు 15000 అంటూ అది కూడా మర్చిపోయారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చల్లంచర్ల లక్ష్మీ తులసి సాంబశివరావు, భవనం రాఘవరెడ్డి, ఏపూరీ శ్రీనివాసరావు, రాయపాటి పురుషోత్తం, కళ్ళం భాస్కర్ రెడ్డి, నక్క శ్రీనివాస్ రావు, మధిర రామలింగారెడ్డి, పక్కాల సూరిబాబు, చిట్టా విజయ భాస్కర్ రెడ్డి, అచ్యుత శివప్రసాద్ రాజవరపు శివనాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు మౌలాలి, వరికల్లు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు అనంతవరం రానున్న సీఎం, డిప్యూటీ సీఎం

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం లో పాల్గొననున్న నేతలు



**గుంటూరు, మేజర్ న్యూస్ :** తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలో జూన్ 5 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వన మహోత్సవం -2025 కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను బుధవారం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్ కుమార్, రాష్ట్ర ఏపీఎంఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు తో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణ స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు అందించారు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అధికారులతో మాట్లాడుతూ జూన్ 5 వ తేదీన ముఖ్యమంత్రి గారి కార్యక్రమం నిర్వహణకు సంబంధించి అధికారులు చేపట్టవలసిన పనులపై సూచనలు అందించారు. శానిటేషన్, వాహనాల పార్కింగ్, బ్యారికేడ్ పనులను సజావుగా చేపట్టాలన్నారు. నిరంతర విద్యుత్శక్తి సరఫరా ఉండేటట్టు ట్రాన్స్కో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారి కార్యక్రమం ప్రశాంతంగా, చక్కగా నిర్వహించేదుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ కన్జర్వేటర్ రాజు , అడిషనల్ ఎస్పీ ( లా అండ్ ఆర్డర్ ) రవి కుమార్ , డిఎస్పి మురళి కృష్ణా, ఏపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ ఎండి.నజీమా బేగమ్ , ఏపీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బసవేశ్వర రావు , తుళ్ళూరు సిఐ శ్రీనివాస రావు, తుళ్ళూరు, గుంటూరు పశ్చిమ తహశీల్దార్లు సుజాత , వెంకటేశ్వర్లు , రెవెన్యూ , పోలీస్, పంచాయితీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు తోపుడు బళ్లు, కార్మికుడికి ప్లాట్ ఫామ్ రిక్షా పంపిణీ






- స్థానిక నాయకులతో తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షా అందజేయించిన మంత్రి నారా లోకేష్
- మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

**మంగళగిరి మేజర్ న్యూస్:** నియోజకవర్గంలో పేద, బడుగు బలహీన వర్గాల వారికి రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా సహాయ సహకారాలు చేస్తూ అండగా ఉంటున్నారని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన కట్టెపోగు లక్ష్మయ్య, తాడేపల్లి 3వ వార్డుకు చెందిన ఉయ్యాల కోటేశ్వరికి తోపుడు బళ్లు, నిడమర్రు గ్రామానికి చెందిన తాడిశెట్టి రామస్వామికి ప్లాట్ ఫామ్ రిక్షా అందజేశారు. తమకు బండ్లు అందజేయాలని చిరువ్యాపారులు, రిక్షా కార్మికుడు మంత్రి నారా లోకేష్ ని కోరగా స్పందించిన ఆయన స్థానిక నాయకుల చేతుల మీదుగా బుధవారం తోపుడు బండ్లు, ప్లాట్ ఫామ్ రిక్షా అందజేయించారు. లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోట పార్థసారథి, వల్లభనేని వెంకట్రావులు మాట్లాడుతూ చాలీ చాలని సంపాదతో అద్దె భారంతో ఇబ్బందులు పడుతున్న చిరువ్యాపారులకు సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో మంత్రి నారా లోకేష్ గత ఐదు సంవత్సరాలుగా వారికి అవసరమైన వివిధ రకాల బండ్లు తయారు చేయించి పంపిణీ చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని చిరువ్యాపారులకు మంత్రి నారా లోకేష్ అన్ని రకాలుగా అండగా ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, తాడేపల్లి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్ బాషా, 3వ వార్డు అధ్యక్షులు వనమా సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు తోట రామారావు, వార్డు ప్రధాన కార్యదర్శి షీమాన్, తాడిబోయిన చలపతిరావు, కడియం శ్రీనివాసరావు, మీసాల నాగేశ్వరరావు, మేకల ఏడుకొండలు, పిన్నిబోయిన నరేంద్ర, తోట గంగాధరరావు, షేక్ నజీర్, పేరుబోయిన వెంకటేశ్వరరావు, బత్తుల నాగరాజు, హరికృష్ణ, ఎస్ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జేసాప్ రాష్ట్రస్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కడప జిల్లా టీం

## చిత్తూరు జట్టుపై ఘనవిజయం సాధించిన కడప జిల్లా జట్టు





**గుంటూరు, మేజర్ న్యూస్ :** జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జేసాప్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్ ను గత మూడు రోజులుగా గుంటూరు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో, జేకేసీ కాలేజ్ గ్రౌండ్ లో జరుగుతుంది. ఈ సందర్భంగా బుధవారం సెమి ఫైనల్, ఫైనల్ మ్యాచ్ లు జరిగాయి. సెమిఫైనల్ లో వెస్ట్ గోదావరి టీం 16.0 ఓవర్లలో 103 పరుగులు చేయగా వారిపై చిత్తూరు టీం 13.4 ఓవర్లలో 108 పరుగులు చేసి విజయాన్ని పొందింది. రెండో సెమి ఫైనల్ లో కడప టీం 12 ఓవర్లకు 140 పరుగులు చేయగా, శ్రీకాకులం జట్టు 12 ఓవర్లకు 102 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఫైనల్ లో కడప, చిత్తురు జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు 16 ఓవర్లలో 169 పరుగులు చేసింది, అనంతరం బ్యాటింగ్ కు దిగిన చిత్తురూ టీం 16 ఓవర్లకు 135 పరుగులు చేసి ఓటమి పాలైంది. కడప టీం టైటిల్ ను గెలిచింది. విజేతలకు, రన్నర్స్ కు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జర్నలిస్ట్ క్రీడాకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఇటువంటి క్రీడా పోటీలు వల్ల శారీరక దేహదారుఢ్యము,మానసిక ప్రశాంతత కలుగుతుంది అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్ట్ లు అందరితో కలసి ఇలా క్రికెట్ ను నిర్వహించుకోవటం చాలా సంతోషం ఉందన్నారు. జర్నలిస్టులకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో జర్నలిస్టులపై విపరీతంగా దాడులు జరిగాయని, కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముందుండి పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇలాంటి క్రీడలు మరిన్ని జరగాలని అందుకు తప్పనిసరిగా తోడ్పాటును అందచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విజేతలుగా నిలిచిన కడప టీం కు, రన్నర్స్ చిత్తురూ జట్టుకు ట్రోఫీలను ,ప్రైజ్ మనీని అందచేశారు. మూడు రోజులు నిర్వహించిన ఈ టోర్నమెంట్ విజయవంతంగా జరగటం, 13 జిల్లాల జర్నలిస్ట్ లు పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. రమణ, కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్స్ డా. జయకిషన్, స్పోర్ట్స్ ఇంజ్యూరి స్పెషలిస్ట్ డా. సాయి కృష్ణ , భాష్యం కిరీటీ , జేసాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, టోర్నమెంట్ నిర్వాహకులు పుల్లంశెట్టి ఉదయ్ కుమార్, పెంజర్ల రాజేష్, ఇక్కుర్తి వెంకటేష్, బండారు రాము, జేసాప్ రా ష్ట్ర, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : కార్పొరేటర్ మీరావలి



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 10వ డివిజన్ లో పారిశుద్ధ పనుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని డివిజన్ లో అభివృద్ధి పనులలో నిర్లక్ష్యం ఉంటే సాహించేది లేదని స్థానిక కార్పొరేటర్ షేక్ మీరావ లి పేర్కొన్నారు. స్థానికులతో కలిసి బుధవారం వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డులో నెలకొన్న పరిస్థితులను స్థానిక ఎమ్మెల్యే షేక్ నసీర్ అహ్మద్ , నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ( నాని) దృష్టికి తీసుకెళ్లగా వారి ఆదేశాల మేరకు 10 వ డివిజన్లోని పారిశుధ్య పనులను దగ్గరుండి చర్చించినట్లు ఆయన విలేకరులతో తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మీరావలి మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తూర్పు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పారిశుధ్యం, అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. నగర మేయర్ కోవెలమూడి నాని నూతనంగా ఎన్నికైనప్పటి నుండి గుంటూరు నగర అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో గుంటూరు అభివృద్ధికి ఆవడ దూరంలో ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకముందే అభివృద్ధి పనులతో గుంటూరు నగరం ముందుకు దూసుకు వెళు ,్తందని కార్పొరేటర్ మీరావాలి పేర్కొన్నారు. వార్డులో ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జగన్ హయాంలో రాక్షస, అరాచక పాలన సాగింది : ఎమ్మెల్యే కన్నా



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** పట్టణం, రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ, కూటమి నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం జరిగిన మీడియా సమావేశం లో శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ జగన్ హయాంలో రాక్షస ,అరాచక పాలన సాగిందన్నారు. వైసీపీ పాలనలో ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురుచుశారు . జరిగిన ఎన్నికల్లో ప్రజలు జగన్ కు బుద్ధి చెప్పారు .కూటమి ప్రభుత్వం లో ప్రజాస్వామ్య పాలన జరుగుతుం దన్నారు. తెనాలి లో అరాచక శక్తులను జగన్ ప్రోత్సాహిస్తున్నారు..గతంలో పరామర్శ వెళ్లిన లోకేష్ పై వైసీపీ వాళ్లు దాడి చేశారు..అరాచక శక్తులకు జగన్ మద్దతు .. చంద్రబాబు అధికారంలోకి రావటంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు .ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో కొండమోడు –పేరేచర్ల రహదారి పనులు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం లో అభివృద్ధి ,సంక్షేమం పరుగులు తీస్తుంది . అమరావతి రాజధాని రావటంతో భూములు విలువ పెరిగింది .. కూటమి ప్రభుత్వంలో గంజాయి డ్రగ్స్ మాఫియా పై ఉక్కుపాదం మోపుతున్నారు. ఏపీ లో గంజాయి డ్రగ్స్ మాఫియా భరతం పడతానని ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఇప్పటికే స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలను అమలు చేసింది. కుంభకోణాల నుంచి ప్రజాదృష్టి మళ్లించడానికి ధర్నాల డ్రామా ఆడుతున్న జగన్ ముఠా..సత్తెనపల్లి నియోజకవర్గాన్ని తొలి ఏడాది కాలంలోనే 25 కోట్ల రూపాయల అభివృద్ధి చేసుకున్నాం.. మొదటి నెలలోనే 4000 పింఛను పెంచి అమలు చేశాం... పేదవాడి ఆకలి తీర్చే రాష్ట్రంలో 203 అన్నా క్యాంటీన్లు తెరిచాము.. ఎప్పటి నుండో పెండింగ్లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ శాంక్షన్ చేయించుకున్నాం.. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి తొలి ఏడాదిలోనే కోటి 76 లక్షల 66 వేల 255రూపాయలు విడుదల చేశారు. రానున్న రోజుల్లో సత్తెనపల్లి నియోజకవర్గం అభివృద్ధి దిశగా రూపురేఖలు మారుస్తాం.. అమ్మకు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కూటమి గెలిపించుకున్న రోజు ఇది. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారం రాగానే వారిని ఘోరంగా మోసం చేసిన జగన్ ను ప్రజలు తమ ఓటుతో తరిమికొట్టిన రోజు..కూటమి ప్రభుత్వంపై అపార నమ్మకంతో చారిత్రాత్మక విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకున్నారు కన్నా లక్ష్మీనారాయణ. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, పట్టణ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పొగాకు రైతులను ఆదుకోవాలి



**పెదకాకాని మేజర్ న్యూస్ :** వెనిగండ్ల గ్రామంలో రైతులు పండించిన పొగాకు పంటను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించటం జరిగినది ఈ కార్యక్రమానికి వెనిగండ్ల గ్రామ సిపిఐ సహాయ కార్యదర్శి సొలస వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరముల నుండి రైతులు ఏ పంట పండించిన గిట్టుబాటు ధర రావటం లేదని నిరాశ చెందుతూ ఉంటే ఐటీసీ జిపిఐ అలెవెన్స్ వంటి కంపెనీలు సీడ్స్ విత్తనాలను రైతులకు అందించి మీరు పండించిన పొగాకును మేమే కొట్టామని హామీ ఇవ్వడంతో రైతులు వారి మాటలు నమ్మి అప్పులు చేసి సుమారు 120 వేల హెక్టార్లలో పొగాకు పంట పండించడం జరిగిందన్నారు ఈ పంట సుమారు 120 వేల హెక్టార్లలో వేయడం జరిగిందన్నారు కానీ పండించిన పంటకు నాలుగు వేలు లేదా ఐదు వేలకు మించి కొనటం లేదని అడుగు ఆకు అయినట్లయితే 2 వేల రూపాయలకు మించి కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం. తరపున ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖ మంత్రి లు మీడియా ప్రకటనలో మాట్లాడుతూ 12 వేలకు కొనాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు ఈ దశలో రైతులు కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు ఈ దశలో అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే ఏజెన్సీల ద్వారా నల్ల బర్లీ వైట్ బర్లీ పొగాకులను 18 వేల రూపాయలకు కొనుగోలు చేసి రైతు కౌలు రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పొగాకు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని గుంటూరులో గల జిపిఐ కార్యాలయం వద్ద రేపు ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించబ డుతుందని ఈ ధర్నా లో పొగాకు రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని అగస్టీన్ చెన్నారెడ్డి వెంకటప్ప రెడ్డి పాములు దర్గారెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు మార్చే దిశగా చూడాలి



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా నరసరావుపేటలోని బృందావన్ మీటింగ్ హాల్లో వ్యవసాయ శాఖ మరియు ప్రకృతి వ్యవసాయ విభాగం సమన్వయంతో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం నుండి శ్రీనివాసరావు జిల్లా వ్యవసాయ శాఖ నుండి నరసరావుపేట డివిజన్ సంయుక్త సంచాలకులు మస్తానమ్మ, శివకుమారి హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే కాలంలో రైతులకు ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని చెప్పడం జరిగింది. ప్రతి రైతు 30 రకాల విత్తనాలతో పిఎండిఎస్ విధానాన్ని ఆచరించాలని ఈ విధానం ఆచరించడం ద్వారా భూమికి అన్ని రకాల సూక్ష్మజీవులు, అందుబాటులోకి రావడంతో పాటు భూమి ఉత్పాదక శక్తి పెరుగుతుందని, అంతేకాకుండా తరువాత వేయబోయే ప్రధాన పంటకు చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని రైతులకు కలుపుకు వెచ్చించే ఖర్చు తగ్గుతుందని, భూమికి నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుందని తెలియజేయడం జరిగింది. భూమిని 365 రోజులు వివిధ రకాల పంటలతో కప్పి ఉంచాలని చెప్పడం జరిగింది. మస్తానమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని తెలియజేయడం జరిగింది. శివకుమారి మాట్లాడుతూ ప్రతి కుటుంబం వారి ఆరోగ్యం కొరకు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు ప్రకృతి వ్యవసాయ మోడల్స్ ఆచరించాలని ఏటీఎం మోడల్( రైతుకు నిరంతరం ఆదాయం) విధానం ఆచరించడం ద్వారా రైతులకు ప్రతిరోజు ఆదాయం లభిస్తుందని దానిద్వారా వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుందని అంతే కాకుండా వ్యవసాయానికి అవసరమైన ఇన్పుట్స్ రైతు స్థాయిలో తయారు చేసుకోగలుగుతారని చెప్పడం జరిగింది. ప్రతి రైతు దగ్గరకు ప్రకృతి వ్యవసాయ విధానాలు చేరవేయాలని దీని కొరకు ఈ నెలలో గ్రామస్థాయి వ్యవసాయ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ రాజు, జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా పుష్పయాగం



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల రైలుపేట మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు బుధవారం ఘనంగా పుష్పయాగం నిర్వహించారు .గ్రామానికి చెందిన కొంగర జోగేంద్ర ప్రసాద్ నగరాజు కుమారి దంపతులు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. నవగ్రహ నక్షత్ర హెూమాలు వైభవంగా జరిపారు. గ్రామంలోని మహిళలు భక్తులు విశేషంగా పాల్గొని హెూమాన్ని ప్రత్యేక పూజా కార్యక్రమాలను తిలకించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

## తెలుగుదేశం నేతల సంబరాలు



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** కూటమి .ప్రభుత్వం ప్రజా విజయం సాధించి ఏడాది పూర్తి కావడంతో బుధవారం దుగ్గిరాల రైలుపేట అన్న క్యాంటీన్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సంబరాలు . జరుపుకున్నారు. ముందుగా కేక్ కట్ చేశారు .అనంతరం బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గుంటూరులో పోలీసులు వర్సెస్ అంబటి



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు వర్సెస్ సీఐ వెంకటేశ్వర్లు అన్నట్టుగా ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వైసీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా అంబటి రాంబాబు కలక్టరేట్ వద్దకు వెళుతుండగా టీజేపీఎస్ కాలేజీ వద్ద ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎందుకు అడ్డుకుంటున్నారు అని అంబటి ప్రశ్నించగా సీఐ వెంకటేశ్వర్లుతో ఆయనకు గొడవ జరిగింది. ఇద్దరూ ఒకరిపైకి ఒకరు వెళ్లారు. నేనేంటో చూపిస్తానంటూ అంబటి రాంబాబు అనగా సీఐ ఏంటి నువ్వు చూపించేది బొంగు చూపిస్తావా అంటూ రెచ్చిపోయారు. మర్యాదగా మాట్లాడాలని అన్నారు. ఇద్దరి మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరింది. ఇద్దరూ కొట్టుకునే వరకు గొడవ చేరుకుంది. పక్కనే ఉన్న పోలీసులు ఇద్దరికి నచ్చుజెప్పారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. అంబటిని అక్కడ నుండి పంపించారు.

## జనసేన ఆధ్వర్యంలో పీడ విరగడై ఏడాది కార్యక్రమ నిర్వహణ

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో నాటి పాలక పక్షాన్ని ఓడించి జనసేన, టిడిపి, బీజేపీ ఎన్డీయే కూటమి అఖండ జివిజయం సాధించి నేటికీ ఏడాది పూర్తయింది. 'పీడ విరగడై ఏడాది' అనే కార్యక్రమాన్ని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ , ఏపీఎంఎస్ఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డా.పసుపులేటి హరిప్రసాద్, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ వేగుళ్ళ లీలాకృష్ణ, పార్టీ నేతలు గంజి చిరంజీవి, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, బడే కోమలి, రావి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఆధ్వర్యంలో దీపావళి తరహా పండుగ వేడుకలు





**గుంటూరు, మేజర్ న్యూస్ :** బుధవారం పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా సంక్రాంతి–దీపావళి తరహాలో పండుగ వాతావరాన్ని సృష్టించేలా కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ , జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరమహిళలు, జనసైనికులు పెద్దఎత్తున పాల్గొని సంప్రదాయబద్ధంగా అందమైన ముగ్గులతో సంక్రాంతిని, దీపాలతో కార్యాలయాన్ని వేలుగుల్లో నింపి దీపావలీని ప్రతిబింబిచేలా రెండు పండుగలను ఒకేరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు రాష్ట్రం అంతటా ఒక పండుగ తరహాలో కూటమి ప్రభుత్వం గెలిచిన సంవత్సర కాలాన్ని జరుపుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి అతలాకుతలం అయిపోయిన విషయాన్నీ ప్రజలందరూ గ్రహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ సంవత్సరకాలంలో ఈ అప్పుల బాధను ఎదురుకుంటూ కేంద్ర ప్రభుత్వంతో సాన్నిహిత్యం కలిగిన పవన్ కళ్యాణ్ పరిపాలనానుభవం కలిగిన చంద్రబాబు నాయుడు గారు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా జనసేన పార్టీ తరపున ప్రజలందరికి హామీ ఇస్తున్నాము.. రానున్న 4 సంవత్సరాలు కూడా ప్రజల క్షేమాన్ని కోరుకుంటూ సుపరిపాలన అందిస్తాం. ప్రజలు జగన్ మోహన్ రెడ్డి అహంకారాన్ని అణిచేందుకు తమ ఓట్ల రూపంలో 11 సీట్లకు కుదించి అధికారాన్ని దూరం చేసారు. జగన్ మోహన్ రెడ్డి వెన్నుపోటు అంటూ ప్రజలమీద కోపాన్ని ప్రదర్శించటం సిగ్గుచేటు. ఇలాంటి వ్యక్తిని రాజకీయాల నుండి తరిమేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 1 సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా ఈరోజు వేడుకలు నిర్వహించిన ప్రజలందరికి, జనసేన పార్టీ నాయకులకి, జనసైనికులకి మరి ముఖ్యంగా వాడ–వాడలా ముగ్గులతో సంప్రదాయబద్ధంగా అట్టహాసంగా వేడుకలను విజయవంతం చేసిన మా వీరమహిళలందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము అని అన్నారు.

# వీధి నాటకాల ద్వారా హెచ్ఐవి & ఎయిడ్స్‌పై అవగాహన



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశముల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ పల్నాడు వారు కళాజాతర బృందాలను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమములో భాగముగా ఈ ప్రభ కల్చరల్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం పిడుగురాళ్ళ మండలంలోని జానపాడు గ్రామ సెంటర్ నందు జానపద కళారూపమైన వీది నాటకము ద్వార హెచ్ఐవి %డ% ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్ఐవి & ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి, హెచ్ఐవి & ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజంలో కలిసి జీవించాలి, హెచ్ఐవి & ఎయిడ్స్- క్షయ వ్యాధి సంబంధం గురించి, హెచ్ఐవి ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, సుఖవ్యాధులు, చికిత్స గురించి, కండోమ్ యొక్క ఉపయోగం గురించి, హెచ్ఐవి,ఎయిడ్స్ యాక్ట్ 2017 గురించి ప్రజలలో విస్తృతంగా అవగాహనా కల్పించడం జరుగుతుందని చెప్పడం జరిగింది. అంతేకాకుండా హెచ్ఐవి పరీక్ష అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తారని , హెచ్ఐవి %డ% ఎయిడ్స్ వ్యాధి ఉన్నవారు ఏఆర్ టి కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని అంతేకాకుండా క్రమం తప్పకుండా సిడి 4 మరియు వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని చెప్పడం జరిగింది. హెచ్.ఐ.వి టోల్ ప్రి నెంబర్ 1097 గురించి కార్యక్రమమలో పల్నాడు జిల్లా సిపిఎం జానీ భాషా, పిడుగురాళ్ల రీడ్స్ టిఐ సిబ్బంది, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం డి గౌస్, ప్రాజెక్ట్ మేనేజర్ కోమలి, ఓఆర్ డబ్ల్యు శేషయ్య, పిఆర్ ఎడ్యుకేటర్ హనుమంతరావు,మాబుల కళాజాత బృందం వారు, వీర్నాల మల్లిఖార్జున రావు, వెంకటలక్ష్మి, మిర్యాల మలయ్య, బి.కనకరావు, బి.ప్రభావతి, వి.శాంతి, ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రధాన ఎజెండా : వలివేటి మురళీకృష్ణ



**పెదకాకాని మేజర్ న్యూస్ :** రాక్షస పాలన పోయి రామరాజ్యం ఏర్పడి నేటికీ సంవత్సరం పూర్తయిందని రాష్ట్ర అభివృద్ధి ప్రధాన ఏజెండాగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ పేర్కొన్నారు మంగళవారం మండల కేంద్రమైన పెదకాకానిలోని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి సంవత్సరం కాలంలో ఈ రాష్ట్రం అభివృద్ధి పదంలో నడుస్తు పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కాలంలో పొన్నూరు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. అందులో భాగంగా పెదకాకాని మండలంలో 27.60 లక్షల వ్యయంతో మండలంలోని 12 ప్రాంతాల్లో గోకులం షెడ్ల నిర్మాణాలు 5.90 కోట్ల ఎంజిఎన్ఆర్ జిఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైన్స్ నిర్మాణం 40.00 లక్షల వ్యయంతో నంబూరు గ్రామం నందు బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి. 2.20 కోట్ల నిధులతో మండలంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి శ్రీకారం, 4.00 కోట్ల పీఎంజిఎస్వై పథకం నిధులతో జాతీయ రహదారి 16 నుండి వయా కొప్పురావూరు జొన్నలగడ్డ వరకు రోడ్డు నిర్మాణం 50.00 లక్షల నిధులతో వెనిగండ్ల ప్రాథమిక ఆసుపత్రి అభివృద్ధి 3.50 కోట్ల నిధులతో జాతీయ రహదారి 16 కాకాని సెంటర్ వద్ద నుండి వయా వెనిగండ్ల గ్రామం నుండి రెడ్డి పాలెం వరకు రోడ్డు నిర్మాణం 63.07 కోట్లతో 10,435 మందికి వివిధ పింఛన్ల పంపిణీ ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి పేదల వైద్య, చికిత్సల కోసం ఆర్థిక సాయం 34 .45 లక్షల నిధులతో గోశాల నిర్మాణానికి కృషి జాతీయ రహదారి నుండి నంబూరు వరకు ఆర్ & బి బి టి రోడ్డు కాజ నుండి నంబూరు, నంబూరు నుండి ఉప్పలపాడు వరకు బి టి రోడ్డు నిర్మాణం 1.2 కోట్ల నిధులతో గుంటూరు నల్లా మీద ఉప్పలపాడు వద్ద కల్వర్టు నిర్మాణానికి కృషి 1.00 కోటి (సుమారు) నిధులతో రైతుల కొరకు పంటకాలువలు, మురుగు నీటి కాల్వలు ఆధునీకరణ వంటి పనులు ఈ సంవత్సర కాలంలో పూర్తి చేయడానికి సహకరించిన కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్ పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ కి ధన్యవాదాలు తెలిపినారు. రాబోయే నాలుగు సంవత్సరము కాలంలో పెదకాకాని మండలం అభివృద్ధి చేయడానికి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పక్కా ప్రణాళికలతో ముందుకు వెళు _న్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో మండలంలోని తెలుగుదేశం-జనసేన-బిజెపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తుత్తి పథకాలతో ప్రజలను వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం

**వెన్నుపోటు దినోత్సవ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి, వైసీపీ నాయకులు**





**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు వెన్నుపోటు దినం కార్యక్రమం పిడుగురాళ్ల లో నిర్వహించారు - ప్రజలకు హామీలిచ్చి వాటిని గాలికోదిలేసి - చంద్రబాబు చేసిన మోసాలు, ఆరాచకాలు, అన్యాయాలపై వై.యస్.ఆర్. సీ.పీ నిరసన ర్యాలీ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 147 హామీలు, సూపర్ - 6 పథకాలు ఇస్తానని ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా.. ఒక్క పథకం అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి పాలనను నిలదీస్తూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు నేడు బుధవారం కాసు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో కలిసి పిడుగురాళ్ల పట్టణంలోని వైఎస్సాఆర్సీపీ కార్యాలయం నుండి పిడుగురాళ్ల పట్టణ మునిసిపల్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినోత్సవ నిరసన ర్యాలీ చేసి అనంతరం బహిరంగ సమావేశంలో కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను అబద్దపు హామీలను ప్రజలకు వివరిస్తూ.. గురజాల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. సంవత్సరం అయింది కూటమి ప్రభుత్వం ఏర్పడి, రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, శ్రీకృష్ణదేవరాయలు ఎంపీగా, గురజాల కు యరపతినేని శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలిచి, ఏం జరిగింది గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి, మొదటి మూడు నెలల్లోనే అభం శుభం తెలియని బీసీ కులస్తులు ఐదుగురు. త్రాగునీరు వల్ల డయేరియా వచ్చి చనిపోయారు. అలాగే దాచేపల్లిలో ఇద్దరూ ఈ ఏడుగురు కూడా డయేరియా వచ్చి చనిపోయారు. వారి చనిపోయింది విషంత్రాగో, పురుగులమందు త్రాగో, కల్తీ సారాయి త్రాగోకాదు స్వచ్ఛమైన మంచినీరు త్రాగి అటువంటిది ఈ ప్రభుత్వం. చేతకాని దద్దమ్మ ప్రభుత్వం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పిడుగురాళ్ల కు 75 సంవత్సరాలలో మొట్టమొదటిసారిగా కృష్ణానది నీరు తీసుకువస్తే, వాళ్లేమో కలుషిత నీరు ఇచ్చి ఏడూరిని మర్డర్ చేసింది కూటమి ప్రభుత్వం. వైన్ షాపుల్లో పర్సంటేజీ, మైన్ లు దోచుకోవటం చివరికి ఎంత దారుణం అంటే జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఊరికో సచివాలయం, వీధికో ససివాలయం పెడితే , వాళ్లేమో వీధికో పేకాట పెట్టి ఆడుతున్నారు. ఇది గురుజాల నియోజకవర్గం లో జరుగుతున్న అభివృద్ధి. వైసీపీ ప్రభుత్వం 5 వందల కోట్ల రూపాయలతో పిడుగురాళ్ల కు మెడికల్ కాలేజీ తీసుకవచ్చి 90 శాతం హాస్పటల్ పూర్తి చేస్తే, 70 శాతం మెడికల్ కాలేజీ పూర్తి చేస్తే, సంవత్సరం నుంచి అంగుళం పెరగలేదు. పిడుగురాళ్ల - జానపాడు ఆర్ఓబి బ్రిడ్జి రూ. 50 కోట్ల రూపాయలతో శాంక్షన్ చేపిస్తే, అది మొదలవలేదు. మొన్న మేము ధర్నా చేస్తాం, కోర్టుకు వెళతాం అంటే మళ్లీ శంకుస్థాపన చేశారు. మీరు 10 సార్లు శంకుస్థాపన చేసుకున్నా.. మాకు అభ్యంతరం లేదు. మాకు కావాల్సింది జానపాడు బ్రిడ్జి పూర్తి కావడం. జానపాడు ప్రజల రుణం తీర్చుకోవడం. గురజాల, దాచేపల్లి మండలాలను మున్సిపాలిటీలుగా చేశాం, గురజాల, దాచేపల్లి కి 4 వందల కోట్లతో హైవే తీసుకువచ్చాం. బైపాస్ రోడ్డు పూర్తి చేసాం, పిడుగురాళ్ల పట్టణంలో రోడ్డు వేలేడు పూసేసాం, 30 వేల మందికి ఇళ్ల పట్టాలి ఇచ్చాం, 15 వందల కోట్లతో సంక్షేమ నిధులు తెచ్చాం, సుమారు 3,400,71 కోట్లతో వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరిగితే, టీడీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి కానీ, అన్నదాత, ఆశ్ర, గ్యాస్, ఫ్రీ బస్సు, ఎవరికి డబ్బులు వచ్చినాయి ఎమ్మెల్యే యరపతినేని కి, మండల నాయకులకి, తెలుగుదేశం కార్యకర్తలు మొత్తం కలిసి దోసుకుంటున్నారు. మిర్చి పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేదు. సూపర్ సిక్స్ పథకం దేవుడికెరక ఇంత అపఖ్యాతి పొందిన ప్రభుత్వం మొదటి సంవత్సరంలో 40 సంవత్సరాలలో చూడలేదు, కనలేదు, వినలేదు. టీడీపీ ప్రభుత్వం సాధించింది 2,3 లక్షల మంది వాలంటీర్లను 9వేల రేషన్ బళ్లను, వేల మందిని తీసేసారు. ఒకలకన్నా ఉద్యోగం ఇచ్చారా, ఒకరి కన్నా అన్నం పెట్టగలిగారా, కడుపు కొట్టడం గొప్ప కాదు. జగన్మోహన్ రెడ్డి లాగా కడుపు నింపండి. మొదటి సంవత్సరంలోనే రూ. 1,54,000/- వేల కోట్లు ఒప్పులు ఒక రోడ్డు వేయలేదు, ఒక బిల్డింగ్ కట్టలేదు తెలుగుదేశం పార్టీ నాయకుల జేబుల్లోకి వెళ్లాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, చింత సుబ్బారెడ్డి, రేపాల శ్రీను, కొమ్మినేని వెంకటేశ్వర్లు, మాదాల కిరణ్ కుమార్, వీరభద్రుని రామిరెడ్డి, మాచవరం జెడ్పిటీసి శివ యాదవ్, శెట్టిపల్లి పూర్ణ, కావూరి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రాజకీయాల్లో వెన్నుపోటు పితామహుడు నాదెండ్ల భాస్కరరావు

**తెనాలి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర రాజకీయాల్లో వెన్నుపోటుకు నాంది పలికిన ఘనత నాదెండ్ల భాస్కరరావుకు దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైసిపి అధినేత జగన్ పిలుపు మేరకు బుధవారం వెన్నుపోటు దినోత్సవం నిర్వహించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం. అడ్డ నుండి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అక్కడ నుండి గాంధీచౌక్, బోసు రోడ్డు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి నాదెండ్ల భాస్కరరావు రాష్ట్రంలో వెన్నుపోటు పితామహుడిగా నిలిచారన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ ను రెండవసారి వెన్నుపోటు పొడచి అధికారంలోకి వచ్చారన్నారు.




**కూటమి ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు**

అధికారంలోకి రావడానికి కూటమి ఎన్నో హామీలు ప్రకటించి ప్రభుత్వం వాటిని అమలుచేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలో తెల్ల రేషన్ కార్డుదారులు ఎంత మంది ఉన్నారో వారిలో దీపం పథకం క్రింద మొదటి విడత ఎంత మందికి నగదు బదిలీ చేసింది చెప్పాలని డిమాండ్ చేశారు. రెండవ విడత ఎంతమందిని అర్హులుగా గుర్తించారో చెప్పాలన్నారు. ఆయన నేను మీకు ఏంది చెప్పేది అనుకుంటే ఆయన ఓఎస్డి చ వివరాలు బహిర్గతం చేయాలన్నారు. వెన్నుపోటు పితామహుని కుమారుడిగా మంతి నాదెండ్ల మరోసారి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. నీరు ఆయన తండ్రి ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిస్తే నేడు మంత్రి మనోహర్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ లని ఏకంచేసి రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 56వ డివిజన్‌లో జనసేన సంబరాలు

**గుంటూరు, మేజర్ న్యూస్**

గుంటూరు నగరం 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలకు "మన కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా ఘనంగా సంబరం చేసుకుందాం" కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. టపాసులు కాల్చారు. కార్యక్రమం లో కార్పొరేటర్ ఆయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్, జనసేన పార్టీ నాయకులు మార్కెట్ శ్రీను, యర్రగోపు వాసు, బీజేపీ నాయకులు కర్ణాటపు జయరాం కృష్ణ, దృక్షారామం పవన్ కళ్యాణ్, ప్రసాదం కనక సుధాకర్, పాశం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి నాయకుల విజయోత్స ర్యాలీ



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి భారీ ఎత్తున తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణా సంచా కలుస్తూ కాలినడకన ర్యాలీ నిర్వహించారు. మేళ తాళాలతో ఊరేగింపుగా మూడు పార్టీల కార్యకర్తలు జండాల శాత భూనీ మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు గండికోట వెంకటేశ్వర్లు, సయ్యద్ అమిర్ అలీ, వడ్డుపల్లి సాంబశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తురక వీరస్వామి, సర్వేశ్వరరావు, బీజేపీ నాయకుడు వడ్లమూడి వెంకయ్య, అరుంధతి విజయకుమార్, విజయ్ కుమార్, కామిశెట్టి రమేష్, దూదేకుల కాసిం సైదా, మున్సిపల్ వైస్ చైర్మన్ పొన్నం భారతి ఆంజనేయులు, కనిగిరి శ్రీనివాసరావు, జొన్నలగడ్డ శ్రీను, కోట హరి, వల్లంబట్ల నాగేశ్వరరావు, నడికుడి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బిజ్జల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా గుంటూరును అభివృద్ధి చేస్తాం

**నగరం మేయర్ కోవెలమూడి రవీంద్ర వెల్లడి**



**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్ :** క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయంగా నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాల పై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్, కార్పొరేటర్లు, నోడల్ అధికారులతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గుంటూరు నగరంలో వార్డుల వారీగా కార్పోరేటర్లకు మొక్కలు, గుడ్డ సంచులను జియంసి నుండి అందించుట జరుగుతుందన్నారు. ఆయా వార్డులలో కార్పోరేటర్ల ఆద్వర్యంలో స్థానిక ప్రజలు మరియు విద్యార్ధులను భాగస్వాములను చేసుకుంటూ మొక్కలు నాటటం, గుడ్డ సంచులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పోరేటర్ల భాగస్వామ్యం పెరగాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో ఈ సీజన్ కి 5 లక్షల మొక్కలు నాటేలా వార్డు సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్దం చేశామన్నారు. అలాగే ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకు గుడ్డ సంచులను అందించేలా గాంధీ పార్కు మరియు యన్.టి.ఆర్ స్టేడియం దగ్గర వెండింగ్ మెషిన్లను అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే 1 కేజీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇస్తే గాంధీ పార్కు ఎంట్రీ టికెట్ అందించుట జరుగుతున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గురువారం ఉదయం స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి దగ్గర నుండి హిమని సెంటర్ వరకు మాస్ క్లీనింగ్ చేస్తూ, పర్యావరణ పరిరక్షణపై అవగాహనా ర్యాలీ జరుగుతుందన్నారు. యం.యల్.ఎ గారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాదాన్యతనిస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వం మరియు అధికారులదే కాదని, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే విజయవంతం అవుతుందన్నారు. నిత్య జీవితంలో మమేకమౌతున్న నిషేదిత ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి డివిజన్ కు అందించే మొక్కలను సక్రమంగా ప్రజలు సంరక్షించేలా అవగాహన కలిగించాలన్నారు. సదరు సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఎస్.ఈ నాగామల్లేస్వర రావు, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, బి. శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, సి.హెచ్ శ్రీనివాస్, యం.హెచ్.ఓ డాక్టర్ రవిబాబు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## వాకింగ్ ట్రాక్‌లో ఆలపాటికి సభ్యత్వం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో శాసనమండలి సభ్యులు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ బుధవారం సభ్యత్వం నమోదు చేసుకున్నారు. అందులోలో భాగంగా ఆలపాటికి సభ్యత్వం తీసుకుని దరఖాస్తు పూరించారు. ఈ కార్యక్రమంలో వాకింగ్ ట్రాక్ ప్రెసిడెంట్ కన్నసాని బాజీ.. కార్యదర్శి బెజవాడ శివరామకృష్ణ రెడ్డి.పాల్గొన్నారు

## యోగాతో మానసిక స్థిరత్వం : ఎస్‌పి



**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్ :** యోగా వల్ల శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వం, ఆలోచనా సామర్థ్యం మెరుగు పడతాయని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. “నాషా ముక్త భారత్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా అభ్యాస కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. యోగా, ధ్యానం అనేవి శారీరకంగా, మానసికంగా మనిషి యొక్క స్థితిగతులను మార్చగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. యోగా మరియు ధ్యానం అభ్యాసం వలన మనిషి యొక్క ఆలోచనా విధానం మరియు సామర్థ్యం మెరుగుపడతాయి. మానసిక స్థిరత్వం, ప్రశాంతత అలవడతాయి. ఒత్తిళ్లను అధిగమించే శక్తి, సామర్థ్యాలు పెంపొందుతాయి. క్రమశిక్షణ అలవడి, దురలవాట్లకు లోనవకుండా దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) ఏ.హనుమంతు, ఏఆర్ డిఎస్పీ ఏడుకొండలు రెడ్డి, ఆర్.ఐ శ్రీహరి రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కొల్లిమర్ల వంతెనపై సమస్యలు కోకొల్లలు

### వంతెన బాగు చేయాలని కేంద్రమంత్రి పెమ్మసాని కోరుతున్న స్థానికులు - కొమ్మమూరు కాల్వ పై నిర్మించాలని వినతి







**గుంటూరు, మేజర్ న్యూస్ :** పాలకులు, ప్రభుత్వాలు, మారుతున్నారు కానీ ఎప్పటినుంచో ఉన్న సమస్యలు మాత్రం తీరటం లేదు.ఎప్పుడో రెండువందల సంవత్సరాల క్రితం నిర్మించిన అంతేనా పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దీంతో ప్రజల ఇబ్బందులు కాకుమాను మండలం కొల్లిమర్ల గ్రామం వద్ద కొమ్మమూరు కాలువపై 120 మీటర్ల దూరం కేవలం సుమారు 6అడుగుల తక్కువ వెడల్పు తో బ్రిటిష్ పాలకులు వంతెనను నిర్మించారు. ఇది కొమ్మమూరు కాలువపై కొల్లిమర్ల లాకులుగా గుర్తింపు పొందింది. ఈ వంతెనను మార్చి భారీ వాహనాలు తిరిగే విధంగా 20 అడుగుల వెడల్పు తో కొత్త వంతెన నిర్మించాలని స్థానిక కొల్లిమర్ల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతు న్నారు. బ్రిటిష్ పాలకులు అప్పట్లో అదే కాలువ పై పాంద్రపాడు, బండ్లవారిపాలెం వద్ద ఎక్కువ వెడల్పు తో భారీ వాహనాలు వెళ్ళే విధంగా వంతెనలు నిర్మించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే తమ కొల్లిమర్ల వద్ద అతి తక్కువ వెడల్పు తో వంతెనను నిర్మించడం వల్ల బారీ వాహనాలు తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహన. రావాలంటే అవస్థలు పడుతున్నారు. దీంతో కష్టనష్టాలకోర్చి ఈ వంతెన పైనే నరకయాతలా నరక సాగిస్తున్నారు. వంతెన వెడల్పు చిన్నగా ఉండటంతో ట్రాక్టర్లు కూడా అతి కష్టం మీద ఈ వంతెనను దాటాల్సి వస్తోంది. ఈ సమస్య ఎప్పటినుంచో ఉన్న పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పాలకుల విధానాన్ని ప్రజానీకం తీవ్రంగా దుయ్యబడుతోంది. ట్రాక్టర్లకు అవకాశం లేకపోవడంతో ఆటోలు మాత్రమే అటూ ఇటూ తిరుగుతూ ఉంటాయి. ఇప్పుడున్న వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని వంతెనను వెడల్పు చేస్తే తమగ్రామ రూపు రేకలు మారుతాయని ప్రజలు కోరుతున్నారు.గ్రామంలో ఉన్న అన్ని పేద వర్గాల వారికి ఈ ఈ వంతెన ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ అధికారులు పాలకులు పట్టించుకోవటం లేదని ప్రజానీకం ఆరోపిస్తోంది . ఈ వంతెన వెడల్పు పెంచితే పొన్నూరు మండలం దొప్పలపూడి, మన్నవ మీదుగా కాకుమాను, నండినుంచి తెనాలి, చేబ్రోలు వరకు రాకపోకలు సాగే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. గుంటూరు లో అనేక వంతెనలు నిర్మిస్తున్నారని కేంద్రమంత్రి పెమ్మసాని కాస్త చొరవ చూపితే ఎన్నో సంవత్సరాలు నుండి పెండింగ్ లో ఉన్న ఈ వంతెన సమస్య పరిష్కారం అవుతుందని కొల్లిమర్ల గ్రామస్తులు ఆశిస్తున్నారు. కొల్లిమర్ల వంతెనను వెడల్పు పెంచడంతోపాటు కొత్త వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777



నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) – బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు – గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) – స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
ఎం.ఏడుకొండలు – సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి సెల్ : 9030880455
జి.హిరన్మాయి(కన్నల్) – నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్
ఆళ్ల వీరభద్రరావు(భద్రం) – గుంటూరు జిల్లా క్రైం రిపోర్టర్ సెల్ : 9848411984
చెట్టిపోగు కాశి – దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327
శేషగిరి రాజు – మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201
వై.ఏసుబాబు – గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు – సత్తెనపల్లి రిపోర్టర్ సెల్ : 9866246951
చెవుల రంగారావు – మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635
యం.కృష్ణ – మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149
వి.రవికుమార్ – తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200
డి. చైతన్య – వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453
ఎస్.కె.రఫీ – చిలకలూరిపేట ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 99493352147
జి.ఏలియా – ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959
బి.సాంబశివరావు – రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676
రమేష్ – దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు – పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840
కె.నాగరాజు – రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000
డి.రమేష్ – ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ – నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ – శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737
అక్కిరెడ్డి – నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987
లక్ష్మీనారాయణ – రెంటచింతల రిపోర్టర్ సెల్ : 800079075
వి.వెంకటరెడ్డి – బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991
పి.వెంకటేశ్వర్లు – దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ – వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723
ఎస్.విజయభాస్కర్ – గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538
షేక్ నాగూర్ – నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300
ఎం.కోటేశ్వరరావు – మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169
సి.హెచ్.ప్రసాద్ – గుంటూరు సిటీ రిపోర్టర్ సెల్ : 8125309319
పి.ఆనంద్ – వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239
జి.బాలాజీ – తాడికొండ రిపోర్టర్ సెల్ : 9603424824
రమేష్ – నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600
తేళ్ల రవీంద్రబాబు – గుంటూరు రిపోర్టర్ సెల్ : 7396234032
డి.మల్లికార్జునరావు – యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441

"నేటి దినపత్రిక సూర్య"
ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.